సాక్షి
వికారాబాద్

మంగళవారం । 20 । ఫిబ్రవరి । 2024



అటకెక్కిన 'యంత్రలక్ష్మి'

ఐదేళ్లుగా యంత్రలక్ష్మి పథకం అమలుకు నోచుకోవడం లేదు. దీంతో చిన్న, సన్నకారు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. 8లో▸



కమల వికాసానికి కసరత్తు!

లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ చేవెళ్ల స్థానం కమలం వైపునకు తిప్పుకునేందుకు నేతలు సర్వశక్తులు ఒడ్డుతున్నారు. 8లో▸



వీరత్వానికి ప్రతీక ఛత్రపతి

భావి తరాలకు మహనీయుల చరిత్ర తెలియాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి అన్నారు. 9లో▸

న్యూస్‌రీల్

ప్రైవేటు ఆస్పత్రులకు అనుమతి తప్పనిసరి

వికారాబాద్ అర్బన్: జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు తప్పనిసరిగా వివరాలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా వైద్యాధికారి పాల్వాన్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో కాన్పులు చేసేవారు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకొని ఉండాలని, లేకుంటే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రైవేటు ఆస్పత్రుల వారు గైనకాలజీస్టులు చేసిన కాన్పుల వివరాలను వెంటనే ఈ బర్త్ పోర్టల్‌లో నమోదు చేయాలని తెలిపారు. సహజ కాన్పులు చేసేందుకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, ముందస్తు సమాచారం లేకుండా అనవసర కోత కాన్పులు చేయరాదని సూచించారు. ఇబ్బడిముబ్బడిగా సిజేరియన్లు చేస్తే గైనకాలజీస్టులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జిల్లాస్థాయి పోటీలకు దరఖాస్తుల ఆహ్వానం

వికారాబాద్ అర్బన్: ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలను పురస్కరించుకొని మూడు విభాగాల్లో జిల్లాస్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రాంబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యాస రచన, నినాదాలు, పోస్టర్ విభాగాల్లో పోటీలు ఉంటాయని తెలిపారు. నేను రాత్రి పూట మిలియనీర్‌గా మారితే.. నేను ఆ డబ్బును ఎలా ఉపయోగించగలను అనే అంశంపై వ్యాసరచన పోటీ ఉంటుందని తెలిపారు. 300 పదాలతో ఇంగ్లిష్, తెలుగు, హిందీ భాషల్లో ఏదైనా ఒక భాషలో వ్యాసం రాయాలన్నారు. సమ్మేళనం యొక్క పొదుపు శక్తి అనే అంశంపై నినాదాల పోటీ ఉంటుందని తెలిపారు. పోస్టర్ పోటీ.. డిజిటల్.. సైబర్.. పరిశుభ్రత అనే అంశాలపై చేతితో డ్రా లేదా డిజిటల్‌గా కానీ ఇంగ్లిష్, తెలుగు, హిందీ భాషల్లో వేయవచ్చునని తెలిపారు. పాల్గొనే వారి పేర్లు, పాఠశాల, కళాశాల పేర్లు, వయస్సు, ఫోన్ నంబర్, పాల్గొనే విభాగం వివరాలు దరఖాస్తులో పొందుపరచా లని సూచించారు. ఈ పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేయడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు అర్హులని, ఆసక్తిగల వారు ఈ నెల 22 సాయంత్రం 5గంటల లోపు లీడ్ బ్యాంక్ మేనేజర్ ఈ మేయిల్ idm.vikarabad@gmail.comకు వివరాలు పంపాలని సూచించారు.

భట్టిని కలిసిన 'పట్నం' దంపతులు



భట్టి విక్రమార్కకు బొకే అందజేస్తున్న మహేందర్‌రెడ్డి, సునీతారెడ్డి

అనంతగిరి: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను సోమవారం ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి దంపతులు హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో ఘనంగా సన్మానించి బొకే అందజేశారు. ప్రస్తుత రాజకీయాలపై చర్చించినట్లు తెలిసింది.

రేపు కోస్గికి సీఎం రేవంత్

అభివృద్ధి పనులకు భూమిపూజ చేయనున్న ముఖ్యమంత్రి

- రూ.4 వేల కోట్లతో మాస్టర్ ప్లాన్
- కడా ఆధ్వర్యంలో పనుల పర్యవేక్షణ
- ఏర్పాట్లను పరిశీలించిన నారాయణపేట కలెక్టర్ శ్రీహర్ష



సభాస్థలి వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న నారాయణపేట కలెక్టర్ శ్రీహర్ష, అధికారులు

కొడంగల్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నియోజకవర్గంలోని కోస్గిలో ఈ నెల 21న పర్యటించనున్నారు. సోమవారం నారాయణపేట జిల్లా కలెక్టర్ శ్రీహర్ష, ఎస్పీ యోగేష్ గౌతం, అదనపు కలెక్టర్లు మయాంక్ మిట్టల్, అశోక్ కుమార్‌తో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. ముఖ్యమంత్రిగా రేవంత్ పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటి సారి నియోజకవర్గానికి వస్తున్నారు. సీఎం పర్యటనలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు ఉన్నాయి. కోస్గి పట్టణ శివారు.. కొడంగల్ మార్గంలో హెలీప్యాడ్ ఏర్పాట్లను పరిశీంచారు. ప్రభుత్వ ఇంజనీరింగ్, మహిళా డిగ్రీ కళాశాల తోపాటు ఇతర అభివృద్ధి పనులకు సీఎం భూమి పూజ చేస్తారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో నియోజకవర్గంలోని అభివృద్ధి పనులకు ఒకేచోట శిలాఫలకాలు, భూమి పూజ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసే మహిళా స్వశక్తి సంఘాల స్టాల్స్‌ను సీఎం పరిశీలిస్తారు. సభా వేదిక ఏర్పాట్లు, వీవీఐపీ, వీఐపీ గ్యాలరీలు, భోజన వసతి వంటి సౌకర్యాల గురించి నారాయణపేట జిల్లా అధికారులు చర్చించారు. ప్రొటోకాల్ విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో అన్ని శాఖల అధికారులతో ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన అంశాలపై సమీక్ష నిర్వహించారు. పోలీస్ శాఖ ఏర్పాటు చేసే బారికేడ్లు, భద్రత, పార్కింగ్ అంశాలపై ఎస్పీతో చర్చించారు. కార్యక్రమంలో కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, కోస్గి తహసీల్దార్ శ్రీనివాసులు, నారాయణపేట డీఎస్పీ లింగయ్య, కోస్గి సీఐ సోమ నర్సయ్య, స్పెషల్ బ్రాంచ్ సీఐ రామ్‌లాల్, ఎస్‌ఐ శేఖర్ గౌడ్ పాల్గొన్నారు.

అందుబాటులో ఉండాలి

కలెక్టర్ నారాయణరెడ్డి



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్లు

వికారాబాద్ అర్బన్: కోస్గిలో ఈ నెల 21న సీఎం రేవంత్‌రెడ్డి పర్యటిస్తారని, జిల్లా అధికారులందరూ అందుబాటులో ఉండాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. బుధవారం కోస్గి మండల కేంద్రంలో సీఎం వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తారని, అనంతరం బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. రోడ్లు భవనాలు, నీటిపారుదల, మిషన్ భగీరథ, ఎస్సీ, ఎస్టీ విభాగాల అధికారులు వారి వారి శాఖలకు సంబంధించిన పూర్తి సమాచారంతో సిద్ధంగా ఉండాలని సూచించారు. అంతకుముందు ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా అర్జీలు స్వీకరించారు. 129 మంది వివిధ సమస్యలపై దరఖాస్తులు ఇచ్చారు. రెవెన్యూ సమస్యలపై ఎక్కువ మంది ఫిర్యా దులు చేశారు. ప్రజావాణి అర్జీలను సత్వరం పరిష్కరించాలని సంబంధించిన శాఖల అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు రాహుల్ శర్మ, లింగ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

పుష్కర కాలంగా ఒకే పరిశ్రమ..!

రాకంచర్ల పారిశ్రామిక వాడలో కనిపించని పురోగతి

- నిర్మాణ దశలో మూడు పరిశ్రమలు
- మరో ఆరింటికి అనుమతులు
- 42 ఫ్యాక్టరీల ఏర్పాటుకు అవకాశం
- కొత్త ప్రభుత్వం రాకతో చిగురిస్తున్న ఆశలు



పూడూరు మండలం రాకంచర్ల సమీపంలోని పారిశ్రామికవాడ

వికారాబాద్: జిల్లాలో పారిశ్రామిక వాడల అభివృద్ధి మూడు అడుగులు ముందుకు ఏడు అడుగులు వెనక్కి అన్న చందంగా తయారైంది. 2012లో అప్పటి ప్రభుత్వం పూడూరు మండలం రాకంచర్ల శివారులో పారిశ్రామిక వాడను ఏర్పాటు చేసింది. మంచినీటి వసతి, రోడ్ల వంటి సదుపాయాలు కల్పించారు. పరిశ్రమల కోసం భూములు ఇచ్చిన రైతులు, స్థానికులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని పన్నెండేళ్లుగా చెబుతూనే ఉన్నారు. ఇప్పటి వరకు ఒక్కరికీ ఉపాధి కల్పించలేదు. పరిశ్రమలు రాకపోవడంతో బాగా పండే పొలాలు నిరుపయోగంగా మారాయి. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న వారు సీఎంగా, స్పీకర్‌గా ఉండటంలో ఈ ప్రాంత వాసుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఏడాది క్రితం అప్పటి టీఎస్ ఐఐసీ చైర్మన్ బాలమల్లు ఆ శాఖ అధికారులతో కలిసి పూడూరు మండలంలోని రాకంచర్ల పారిశ్రామిక వాడను సందర్శించారు. త్వరలో పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కానీ ఎలాంటి పురోగతి కనిపించలేదు.

పలు చోట్ల పారిశ్రామిక వాడలు

గత ప్రభుత్వం ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో అనేక చోట్ల పారిశ్రామిక వాడలను ఏర్పాటు చేసింది. పరిగి నియోజకవర్గం పూడూరు మండలంలోని రాకంచర్ల సమీపంలో ఇండస్ట్రియల్ పార్కును ప్రారంభించింది. ఇందు కోసం 150ఎకరాల భూమిని స్థానికుల నుంచి సేకరించారు. చిన్నచిన్న పరిశ్రమలు ఏర్పాటుకు అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించారు. నాటి నుంచి నేటి వరకు ఒకే పరిశ్రమను నెలకొల్పారు. అలాగే వికారాబాద్ సమీపంలోని శివారెడ్డిపేటలో, షాబాద్ మండలంలో, గండేడ్ మండలంలోని నంచర్లలో సైతం పారిశ్రామిక వాడలను ప్రారంభించారు. రాకంచర్లలో మినహా మిగతా చోట్ల పరిశ్రమల ఏర్పాటు పునాది రాళ్లకే పరిమితమయ్యాయి.

కాలుష్యకారక పరిశ్రమల తరలింపునకు సన్నాహాలు

రాజధాని నగరం చుట్టూ ప్రస్తుతం ట్రిపుల్ ఆర్ (రీజినల్ రింగ్ రోడ్డు) నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో దాని లోపలకు వచ్చే కాలుష్య కారక పరిశ్రమలన్నింటినీ బయటకు తరలించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా గతంలో కాటేదాన్‌లో ఉన్న 20 కాలుష్య కారక (ఐరన్ ఓర్) పరిశ్రమలకు ట్రిపుల్ ఆర్ వెలుపలకు తరలించాలని తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టీఎస్ ఐఐసీ) అధికారులు నోటీసులు జారీ చేశారు. ఆ 20 పరిశ్రమలను రాకంచర్ల పారిశ్రామిక వాడకు తరలిస్తామని అధికారులు అంటున్నారు. పరిగి, పూడూరు ప్రాంతంలోని స్టీల్ ఫ్యాక్టరీల నుంచి విడుదలయ్యే కాలుష్యంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు అంటున్నారు. రాకంచర్లలో కాలుష్య కారక పరిశ్రమలు ఏర్పాటు చేస్తే అడ్డుకుంటామని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

మరో 42 పరిశ్రమల ఏర్పాటుకు అవకాశం

2012లో రాకంచర్ల పారిశ్రామిక వాడను ఏర్పాటు చేశారు.150 ఎకరాల భూమిని సేకరించగా..అందు లో 38 ఎకరాలు అటవీశాఖకు చెందిన భూములు ఉన్నట్లు గుర్తించారు. మిగిలిన 112 ఎకరాల్లో 42 పరిశ్రమలు ఏర్పాటు చేయవచ్చని భావించారు. ప్ర స్తుతం ఏర్పాటు చేసిన పరిశ్రమకు 16ఎకరాల భూమిని కేటాయించారు.మరో 96 ఎకరాల భూమి 12 సంవత్సరాలుగా నిరుపయోగంగా ఉంది. ఇటీవల మరో ఆరు పరిశ్రమలకు అనుమతులు వచ్చాయి.



పూజ చేస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్, చిత్రంలో కలెక్టర్ నారాయణరెడ్డి

సేవాలాల్ మహరాజ్ ఆశయాలను నెరవేర్చాలి

- స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్
- ఘనంగా భోగ్ బాండార్

వికారాబాద్ అర్బన్: సద్గురు సేవాలాల్ మహరాజ్ ఆశయాలను నెరవేర్చాలని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం వికారాబాద్‌లోని సత్యభారతి ఫంక్షన్ హాల్‌లో సద్గురు సేవాలాల్ మహరాజ్ 285 జయంతిని ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ నారాయణరెడ్డి అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, జెడ్పీ చైర్ పర్సన్ సునీతారెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సుధాకర్‌రెడ్డితో కలిసి భోగ్ బాండార్ పూజలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మహనీయుల బాటలో సాగితే వారి దీవెనలు ఉంటాయన్నారు. ప్రస్తుత ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళుతోందని తెలిపారు. తండాల అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తోందని పేర్కొన్నారు. జిల్లాలో పరిశ్రమలను స్థాపించి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా పనిచేస్తున్నట్లు చెప్పారు. అనంతరం జెడ్పీ చైర్ పర్సన్ సునీతా రెడ్డి మాట్లాడుతూ.. బంజారా కుటుంబాల్లో వెలుగు నింపిన సంత్ సేవాలాల్ చిరస్మరణీయులని కొనియాడారు. కులమత, రాజకీయాలకు అతీతంగా ప్రజాప్రతినిధులు తండాల అభివృద్ధికి సహకరించాలని కోరారు. అనంతరం కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ.. బంజారా యువత బాగా చదువుకొని అన్ని రంగాల్లో బంజారా రాణించాలని సూచించారు. లంబాడీల సంక్షేమానికి ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా స్థిరపడాలన్నారు. కార్యక్రమంలో వికారాబాద్ ఆర్డీవో విజయకుమారి, గిరిజన సంక్షేమ శాఖ అధికారి కోటాజీ, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఎంపీడీవో వినయ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్, సద్గురు సేవాలాల్ మహరాజ్ సంఘం సభ్యులు కిషన్ నాయక్, పాండు నాయక్, పరశురాం నాయక్, రెడ్డి నాయక్, రాఘవ నాయక్, రాములు నాయక్, బాబ్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మంప్స్.. ముప్పే

- చిన్నారుల్లో వ్యాధి లక్షణాలు
- రెండు నెలలుగా వ్యాప్తి
- పెరుగుతున్న కేసులు
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు



వికారాబాద్ అర్బన్: రెండు నెలలుగా చిన్నారులు, పెద్దలను మంప్స్ వైరస్ ఇబ్బందులకు గురిచేస్తోంది. జిల్లా వ్యాప్తంగా గవద బిల్లల వాపుతో చిన్నారులు అధికంగా అవస్థలు పడుతున్నారు. గవద బిల్లల సమస్యతో చాల మంది పిల్లలు మంచం పడుతున్నారు. ఈ వ్యాధి సోకిన వారికి చెవుల కింద దవడ భాగంలో వాపు రావడం తోపాటు కండరాల నొప్పి, తల, కీళ్ల నొప్పులు, కీళ్లలో వాపు, నోరు తడారిపోవడం, ఆకలి మందగించడం, జ్వరం తదితర లక్షణాలతో పిల్లలు బాధపడుతున్నారు. చిన్న పిల్లలకు గవద బిల్లల సమస్య ఎదురైనప్పుడు వారు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. గొంతు సమీపంలో తీవ్రంగా నొప్పి ఉండటంతో పిల్లలు భోజనం చేయడానికి ఇబ్బంది పడుతున్నారు. సమస్య చెప్పుకోలేక పోతున్నారు. ఇలాంటి సమయంలో పిల్లల తల్లిదండ్రులు పలు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు చూచిస్తున్నారు. వైరస్ లక్షణాలు కనిపించగానే వైద్యులను సంప్రదించాలని, లేక పోతే మరింత ఇబ్బంది పడాల్సి వస్తుందని అంటున్నారు. వ్యాధి పట్ల నిర్లక్ష్యం చేస్తే చెవుడు వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉందని వైద్యులు అంటున్నారు. గవద బిల్లల సమస్యతో బాధపడుతున్న వ్యక్తి దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు, మాట్లాడినప్పుడు వైరస్ గాలిలో ప్రయాణించి ఇతరులకు వ్యాప్తి చెందుతుంది. ఎక్కువగా 15 ఏళ్లలోపు పిల్లల్లో ఈ సమస్య కనిపిస్తుంది. స్కూల్‌కు వెళ్లే చిన్న పిల్లలకు ఒకరికి సమస్య ఎదురైతే వారికి తెలియకుండనే తోటి చిన్నారులకు వ్యాప్తి చెందే అవకాశం ఉంటుంది.

ఐసోలేషన్‌లో ఉండాలి

రెండు నెలలుగా గవద బిల్లల సమస్యతో చిన్న పిల్లల ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. ఏ ప్రైవేటు ఆస్పత్రి వెళ్లినా పదుల సంఖ్యలో గవద బిల్లల సమస్యతో వస్తున్న చిన్నారులే అధికంగా ఉంటున్నారు. ఇటీవల కాలంలో వందలాది మందికి మంప్స్ వైరస్ సోకింది. కొన్ని కుటుంబాల్లో పిల్లల ద్వారా పెద్దలకు వైరస్ వ్యాప్తి చెంది ఇబ్బందులు పడుతున్నారు. గవద బిల్లలు సోకిన వారు వారం రోజుల పాటు ఐసోలేషన్‌లో ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. మంప్స్ వైరస్‌తో బాధపడుతున్న పిల్లలను స్కూల్‌కు పంపరాదని, ఇంట్లో ఉంచడం మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. వ్యాధి ఉన్న సమయంలో తేలిక పాటి ఆహారాన్ని అందించాలంటున్నారు. తగినంత మంచినీరు, పండ్ల రసాలు ఇవ్వాలని వైద్యులు సూచిస్తున్నారు.

నిర్లక్ష్యం చేయొద్దు



ఈ మధ్య కాలంలో మంప్స్‌తో ఆస్పత్రికి వచ్చే పిల్లల సంఖ్య పెరిగింది. వ్యాధి లక్షణాలు కనిపిస్తే ఏమాత్రం నిర్లక్ష్యం చేయ రాదు. వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స చేయించుకోవాలి. నిర్లక్ష్యం చేస్తే చెవుడు వచ్చే అవకాశం ఉంది. ఒకరి నుంచి మరొకరికి తేలికగా సోకే అవకాశం ఉంటుంది. వ్యాధి లక్షణాలు ఉన్న పిల్లలకు మిగతా పిల్లలను దూరంగా ఉంచాలి. ఈ వ్యాధి ఉన్నప్పుడు జ్వరం, నీరసం వంటివి ఎక్కువగా ఉంటాయి. వ్యాధి ఉన్న సమయంలో మంచి ఆహారం ఇవ్వాలి.

– డాక్టర్ సందీప్, చిన్న పిల్లల వైద్య నిపుణులు

నేటినుంచి విజయసంకల్ప యాత్ర

- తాండూరు నుంచి ప్రారంభం
- రాజరాజేశ్వరి బస్సు యాత్రగా నామకరణం
- హాజరుకానున్న కేంద్ర మంత్రి బీఎల్ వర్మ, బండి సంజయ్
- విజయవంతం చేయాలి: మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

అనంతగిరి: బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టబోయే విజయసంకల్ప యాత్రను సక్సెస్ చేయాలని మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం వికారాబాద్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మంగళవారం తాండూరు నుంచి యాత్ర ప్రారంభమై ధారూరు, వికారాబాద్, పరిగి, చేవేళ్ల, రాజేంద్రనగర్, మహేశ్వరం మీదుగా శేరిలింగంపల్లిలో ఈ నెల 22న ముగుస్తుందన్నారు. తాండూరు నుంచి ప్రారంభమయ్యే ఈ యాత్రకు రాజరాజేశ్వరి బస్సు యాత్రగా నామకరణం చేశామన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కేంద్ర మంత్రి బీఎల్ వర్మ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ హాజరుకానున్నట్లు తెలిపారు. పార్టీ శ్రేణులు, అభిమానులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. మూడో సారి మోదీని పీఎం చేయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. పదేళ్ల బీజేపీ పాలనలో దేశం ఎనలేని అభివృద్ధి సాధించిందన్నారు. అనేక రంగాల్లో సంస్కరణలు తెచ్చి నేడు ప్రపంచ దేశాలకు దీటుగా నిలిపారని పేర్కొన్నారు. అంతర్జాతీయ స్థాయిలో మన దేశానికి ఒక మంచి పేరు తీసుకువచ్చిన ఘనత మోదీకే దక్కుతుందన్నారు. ప్రజలంతా బీజేపీ వైపే ఉన్నారని మూడో సారి పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్‌తో బీజేపీ పొత్తు ఉండదన్నారు. అనంతరం పార్టీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి మాట్లాడుతూ..తాండూరు సభకు, ధారూరులో జరిగే కార్నర్ మీటింగ్‌కు, వికారాబాద్ రోడ్ షోకు ప్రజలు వేలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సారి చేవెళ్ల గడ్డపై కాషాయం జెండాను ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అన్ని స్థానాల్లో గెలుస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు శివరాజు, అసెంబ్లీ ఇన్‌చార్జ్ శ్రీధర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు పాండు గౌడ్, కేపీ రాజు, జిల్లా ఉపాధ్యక్షులు వివేకానందరెడ్డి, రాజు, రాజేందర్, బస్వలింగం, రాములు, నరోత్తంరెడ్డి, గోవర్ధన్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

'పీఎం జేజేబీవై'తో ప్రజలకు మేలు

పరిగి ఏడీబీ బ్యాంక్ మేనేజర్ అనుప్రభ



మృతురాలి కుటుంబ సభ్యులకు చెక్కును అందజేస్తున్న బ్యాంకు అధికారులు

పరిగి: కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పరిగి ఏడీబీ బ్యాంక్ మేనేజర్ అనుప్రభ కోరారు. మండల పరిధిలోని సయ్యాద్ మల్కాపూర్ గ్రామానికి చెందిన సుంకరి కిష్టమ్మ గత సంవత్సరం డిసెంబర్‌లో మృతి చెందడంతో పీఎంజేజేబీవై పథకం తీసుకోవడంతో రూ.2 లక్షల బీమా చెక్కును కుటుంబ సభ్యులకు సోమవారం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరికి బీమా అనేది ఎంతో అవసరమన్నారు. అనుకోకుండా కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న వారు మృతిచెందితే, బీమా ఆసరాగా ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ బీమాను చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అటకెక్కిన 'యంత్రలక్ష్మి'

వ్యవసాయాన్ని రైతులకు సులభతరం చేద్దామనే లక్ష్యంతో ప్రభుత్వం యంత్రలక్ష్మి పథకానికి శ్రీకారం చుట్టింది. గత పాలకుల అలసత్వం కారణంగా సబ్సిడీలపై అందాల్సిన యంత్రాలు అన్నదాతలకు అందక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు చవి చూస్తున్నారు. కేవలం రైతుబంధు డబ్బులతో సరిపెట్టి మమ అనిపిస్తున్నారు.

- **ఐదేళ్లుగా పథకానికి తూట్లు**
- ఆందోళనలో అన్నదాతలు
- కొత్త ప్రభుత్వంపైనే ఆశలు

నవాబుపేట: వ్యవసాయ యంత్రలక్ష్మి పథకం కింద చిన్న, సన్నకారు రైతులకు సబ్సిడీపై ఇవ్వాల్సిన పరికరాలను గత కొంత కాలంగా ప్రభుత్వం నిలిపి వేసింది. దీంతో జిల్లా వ్యాప్తంగా అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ప్రభుత్వం ప్రధానంగా రైతుబంధు ఇస్తూ, రైతులకు ఇచ్చే సబ్సిడీయంత్ర పరికరాలు, సీడ్‌లను తీసేసిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చాలా మంది రైతులు గత కొన్నేళ్లుగా యంత్ర పరికరాల కోసం వ్యవసాయాధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. సబ్సిడీలు ఏమీ లేవని అధికారులు తెలపడంతో నిరాశతో వెనుదిరుగుతున్నారు. కొత్త ప్రభుత్వం అయినా సబ్సీడీలు ఇస్తుందేమో అనే ఆలోచనతో రైతులు గంపెడాశలు పెట్టుకున్నారు.

యంత్రాలతో ఉపయుక్తం

యంత్ర లక్ష్మి పథకం కింద చిన్న, సన్నకారు రైతులకు ప్రభుత్వం సబ్సిడీపై పలు రకాల పరికరాలను అందజేసేది. దీంతో రైతులు వాటిని ఉపయోగించుకొని సాగు చేసేవారు. ప్రధానంగా రూ.50 వేల లోపు విలువైన యంత్ర పరికరాలను గతంలో రైతులకు సబ్సిడీపై అందించారు. ముఖ్యంగా తైవాన్ స్ప్రేయర్లు, చేతి పంపులు, రోటోవేటర్లు, ట్రాక్టర్ల కల్టివేటర్లు, ప్లౌ, డిస్కులు, పుల్‌వీల్స్, పట్లర్‌లతో పాటు అంతర్‌కృషి యంత్రాలు ఈ పథకం కింద రైతులకు అందించాల్సి ఉంది. నీటి సరఫరా పైపులు రూ.పది వేల రాయితీతో డీజిల్ ఇంజన్లు, విద్యుత్ మోటార్లు ఇచ్చేవారు.

వేధిస్తున్న నిధుల కొరత

యంత్ర పరికరాల మంజూరు కోసం సాధారణ రాష్ట్ర బడ్జెట్ నుంచి నిధులు కేటాయించాల్సి ఉంది. కానీ గత ప్రభుత్వం 2018 నుంచి బడ్జెట్‌లో వ్యవసాయ యంత్ర పరికరాలకు నిధులు మంజూరు



యంత్ర లక్ష్మి పరికరం

చేయలేదు. దాంతో అధికారులు కూడా ఏమి చేయలేని స్థితిలో ఉన్నారు. యంత్ర పరికరాల సబ్సిడీ మంజూరు కాక పోవడంతో ముఖ్యంగా రైతులు చైనా స్ప్రేయర్లను కొనుగోలు చేసి వినియోగిస్తున్నారు. రూ.వేలు ఖర్చు చేసినప్పటికీ అవి ఎక్కువకాలం పని చేయడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీటి వినియోగం వల్ల ఇబ్బందులు కూడా ఉంటున్నాయని అధికారులు సూచిస్తున్నారు. ఐదేళ్లుగా యంత్ర లక్ష్మి పథకం గంగలో కలిసినట్లే కనిపిస్తుంది. సబ్సిడీ పరికరాల కోసం నాలుగేళ్లుగా ఎదురు చూస్తున్న రైతులకు ఇంత వరకు ప్రభుత్వం నిధులు విడుదల చేయడం లేదు. జిల్లాలో ఉన్న 2 లక్షల 92 వేల మందికి వ్యవసాయ పరికరాలు, సబ్సిడీ యంత్రాలు ఇవ్వాలంటే దాదాపు ఏటా రూ.4-5 కోట్ల వరకు నిధులు అవసరం అవుతాయని నిపుణులు చెబుతున్నారు.

సబ్సిడీపై ఇవ్వాలి



గతంలో ప్రభుత్వం అన్ని రకాల విత్తనాలను సబ్సిడీపై ఇచ్చేది. ఐదేళ్ల నుంచి ఒక్క విత్తనాన్ని కూడా సబ్సిడీపై ఇవ్వడం లేదు. ఇక నైనా అన్ని రకాల విత్తనాలను సబ్సిడీపై ఇవ్వాలని కోరుతున్నాను.

– వెంకటయ్య, రైతు, గొల్లగూడ

రైతుబంధే ఇచ్చారు



గత ప్రభుత్వం వచ్చాకా అన్ని సబ్సిడీలను తీసి వేసింది. కేవలం రైతుబంధు ఇస్తూ, మిగతా అన్ని పథకాలను ఎత్తి వేశారు. కొత్త ప్రభుత్వం అయినా రైతులకు ఉపయోగపడే వ్యవసాయ పరికరాలను సబ్సిడీపై ఇవ్వాలి.

– నారణ్‌రెడ్డి, రైతు, కేషవపల్లి

సమాచారం రాలేదు



ఐదేళ్ల నుంచి ప్రభుత్వం సబ్సిడీపై వ్యవసాయ యంత్రాల పంపిణీకి నిధులు విడుదల చేయలేదు. చాలా మంది రైతులు మొర పెట్టుకున్నారు. ప్రస్తుత ప్రభుత్వం రైతులకు మేలు చేయాలనే ఆలోచనలో ఉంది. కానీ ఇప్పటి వరకు పైఅధికారుల నుంచి ఎలాంటి సమాచారం రాలేదు.

– గోపాల్, జిల్లా వ్యవసాయాధికారి, వికారాబాద్

విజయ సంకల్ప యాత్రను విజయవంతం చేయండి

పార్టీ జిల్లా కార్యదర్శి మల్లేశ్‌యాదవ్

మర్పల్లి: వికారాబాద్ పట్టణంలో మంగళవారం నిర్వహించే బీజేపీ విజయ సంకల్ప బస్సు యాత్రను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బన్నె మల్లేశ్‌యాదవ్ కోరారు. ఈ మేరకు సోమవారం మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మధ్యాహ్నం ధారూరు మండలంలో యాత్ర మొదలవుతుందని, ఆ తర్వాత వికారాబాద్ బీజేఆర్ చౌరస్తా వద్ద బహిరంగ సభ ఉంటుందన్నారు. దీనికి బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌కుమార్‌తో పాటు రాష్ట్ర, జిల్లా నాయకులు హాజరు కానున్నారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు జిల్లా, మండల నాయకులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రామేశ్వర్‌రెడ్డి, లక్ష్మయ్య, రఘుపతి, నాగేశ్, సుభాశ్, శ్రీకాంత్, మైపాల్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, సంతోశ్‌రెడ్డి ఆయా మోర్చాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మల్లేశ్‌యాదవ్

కమల వికాసానికి కసరత్తు!

- లోక్‌సభ ఎన్నికల్లో పాగా వేయడానికి నేతల పాట్లు
- బస్సు యాత్రతో చేవెళ్లపై కొండా ధీమా

తాండూరు: లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ చేవెళ్ల స్థానం కమలం వైపునకు తిప్పుకునేందుకు నేతలు సర్వశక్తులు ఒడ్డుతున్నారు. అందులో భాగంగా పార్టీకి పట్టు తక్కువగా ఉన్న వికారాబాద్ జిల్లా నుంచి బీజేపీ విజయ సంకల్ప బస్సు యాత్రను మంగళవారం నుంచి ప్రారంభించనున్నారు. ఈ యాత్ర తాండూరు పట్టణం నుంచి ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేశారు. మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమానికి జాతీయ నాయకులతో పాటు బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు బండి సంజయ్‌కుమార్ యాత్రకు రానున్నారు. అయితే ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో జిల్లాలో బీజేపీకి మూడు పదుల ఓట్లు కూడా దాటకపోవడం గమనార్హం.

అసెంబ్లీ పోరులో కాంగ్రెస్ సత్తా

చేవెళ్ల లోక్‌సభ పరిధిలోకి ఏడు అసెంబ్లీ స్థానాలు వస్తాయి. మూడు వికారాబాద్ జిల్లా పరిధిలోకి రాగా మరో నాలుగు రంగారెడ్డి జిల్లా పరిధిలోకి వస్తాయి. అయితే ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో వికారాబాద్ జిల్లాలో బీజేపీ కూటమి పార్టీలకు కలిపి 27,872 ఓట్లు మాత్రమే వచ్చాయి. కాంగ్రెస్ పార్టీకి 2,70,083 ఓట్లు, బీఆర్‌ఎస్‌కు 2,26,594 ఓట్లు నమోదు అయ్యాయి. రాబోయే పార్లమెంట్ ఎన్నికలలో చేవెళ్ల లోక్‌సభకు పోటీ చేసే ప్రధాన పార్టీల అభ్యర్థులకు వికారాబాద్ జిల్లా కీలకం కానుంది.



మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

బీజేపీ వైపు వీచేనా..

లోక్‌సభ ఎన్నికలలో బీజేపీకి కలిస్తోందని పార్టీ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. గతేడాది నవంబర్ నెలలో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో చేవెళ్ల పార్లమెంట్ సెగ్మెంట్‌లో 3.31 లక్షల ఓటర్లు కమలానికి ఓటు వేశారు. కాంగ్రెస్ పార్టీకి 6.09 లక్షల మంది జై కొట్టారు. బీఆర్‌ఎస్ పార్టీకి 7.07 లక్షల మంది ఓటు వేశారు. అయితే రెండు ప్రధాన పార్టీల కంటే బీఆర్‌ఎస్ పార్టీకి సుమారు లక్ష ఓట్లు అధికంగా వచ్చాయి. ఆ పార్టీకి ఓటు బ్యాంకు అధికంగా కనిపిస్తోంది. కారు జోరును తగ్గించేందుకు రెండు ప్రధాన పార్టీలు వేగంగా అడుగులు వేస్తున్నాయి. అందులో భాగంగానే బీఆర్‌ఎస్ పార్టీలో ఉన్న ముఖ్య నేతలను, ప్రజాప్రతినిధులను కాంగ్రెస్, బీజేపీలోకి చేర్చుకొంటున్నారు.



మెజార్టీయే లక్ష్యంగా..

జిల్లాలోని మూడు అసెంబ్లీ సెగ్మెంట్‌ల పరిధిలో 2 లక్షల ఓట్లను బీజేపీ వైపునకు మళ్లించుకొనేందుకు నేతలు పావులు కదుపుతున్నారు. అందుకోసం ఇప్పటి నుంచే జిల్లాలో బీజేపీ ఎన్నికల ప్రచారం మొదలు పెట్టింది. మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం విస్తృతమైంది. పార్లమెంట్ ఎన్నికల శంఖరావాన్ని తాండూరు పట్టణం నుంచి నేడు బస్సు యాత్రతో ప్రారంభించనున్నారు. బీజేపీ పార్టీకి ప్రధానంగా ప్రధాని నరేంద్రమోదీ చరిష్మా, అయోధ్య రామమందిర నిర్మాణంతో ప్రజలు బీజేపీకి మద్దతు పలుకుతారనేది పార్టీశ్రేణులు బలంగా నమ్ముతున్నారు.

రైతుల సంక్షేమానికి కృషి



ఎమ్మెల్యేను కలిసిన కుల్కచర్ల పీఏసీఎస్ చైర్మన్ తదితరులు

ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి: రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, వారి అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తుందని ఎమ్మెల్యే టి రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. కుల్కచర్ల సహకార సంఘం నూతన చైర్మన్‌గా ఎన్నికైన కనకం మొగులయ్య సోమవారం ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సహకార సంఘం ద్వారా రైతులకు మంచి సేవలు అందించాలన్నారు. అన్నదాతలకు ఎల్లప్పుడు అందుబాటు ఉండి కావాల్సిన అన్ని రకాల సదుపాయాలను కల్పించాలన్నారు. ప్రాథమిక సహకార సంఘం రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తుందన్నారు. పీఏసీఎస్ ద్వారా రైతు రుణాలు తదితర సేవలను అందించే విధంగా పాటు పడాలన్నారు. సహకార సంఘం అభివృద్ధికి ఎలాంటి సాయం కావాలన్న తమ దృష్టికి తీసుకువస్తే ప్రభుత్వంతో చర్చించి సమకూర్చుతామన్నారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆంజనేయులుముదిరాజ్, బ్లాక్ బి అధ్యక్షుడు భరత్‌కుమార్ నాయకులు వెంకటయ్య, విఠల్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

హ్యాండ్ బాల్ పోటీలకు బాలుర ఎంపిక

వికారాబాద్ అర్బన్: అథ్లెటిక్స్, హ్యాండ్ బాల్ క్రీడా విభాగాల్లో బాలురకు ఎంపిక నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన క్రీడల అధికారి హన్మంత్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. బాయ్స్ స్పోర్ట్స్ కంపెనీ, ఆర్టిల్లరీ సెంటర్ హైదరాబాద్ ఆధ్వర్యంలో హ్యాండ్ బాల్ స్పోర్ట్స్ విభాగంలో అడ్మిషన్ కోసం ఆలిండియా ఓపెన్ సెలక్షన్ నిర్వహిస్తున్నట్లు వివరించారు. పలు రకాల నైపుణ్య పరీక్షల అనంతరం ఎంపిక ఉంటుందన్నారు. బాలుర వయసు 8 నుంచి 14 సంవత్సరాల లోపు ఉండాలన్నారు. ఇంగ్లిష్, హిందీలో తగిన పరిజ్ఞానం ఉండటంతో పాటు, ఏదైనా పాఠశాలలో 3వ తరగతి పాసై ఉండాలన్నారు. ఆసక్తి గల బాలురు ఆధార్, బర్త్ సర్టిఫికెట్లతో ఈ నెల 21 నుంచి 27 వరకు హైదరాబాద్‌లోని మఖాన్ సింగ్ అథ్లెటిక్స్ స్టేడియం, లంగర్ హౌస్, శంకర్‌పల్లి రోడ్డు, గోల్కొండ ఆర్టిల్లరీ సెంటర్‌లో హాజరు కావాలన్నారు.

రేపు తాండూరులో అథ్లెటిక్ మీట్

తాండూరు టౌన్: తాండూరు పట్టణంలోని పాత శాలివాహన కళాశాల మైదానంలో బుధవారం అథ్లెటిక్ మీట్ ఏర్పాటు చేయనున్నట్లు తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి, కార్యదర్శి మధు, రాము ఓ ప్రకటనలో తెలిపారు. అండర్ 14, 16, 18, 20 విభాగంలో బాలబాలికలకు 400 మీటర్ల పరుగు పందెం నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే పురుష, మహిళలకు సైతం పోటీలు ఉంటాయన్నారు. పాల్గొనే వారు తహసీల్దార్ ధ్రువీకరించిన జననపత్రంతో ఉదయం 9 గంటలకు మైదానానికి రావాలన్నారు. వివరాలకు 8978234447, 6300075229 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

డీఎస్పీపై చర్యలు తీసుకోవాలి

తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేసిన ప్రజాసంఘాల నేతలు



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

దోమ: భూ వివాదంలో జోక్యం చేసుకొని అధికార పార్టీ నాయకులతో కుమ్మక్కై, ఓ వ్యక్తిని బెదిరించిన డీఎస్పీని వెంటనే సస్పెండ్ చేయాలని భీమ్‌ఆర్మీ జిల్లా అధ్యక్షుడు అంజిరావన్, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు సత్యయ్య డిమాండ్ చేశారు. సోమవారం దోమ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో డీఎస్పీని సస్పెండ్ చేయాలని ప్రజా సంఘాల నాయకులతో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండల కేంద్రానికి అనుబంధంగా ఉన్న ఉదన్‌రావుపల్లి గ్రామానికి చెందిన అయూబ్ తిమ్మాయిపల్లి గ్రామ పరిధిలోని సర్వేనంబర్ 50/ఏ/1లో ఒక ఎకరం తొమ్మిది గుంటల భూమిని 2018లో కొనుగోలు చేశారు. అప్పటి నుంచి ఖాస్తులో ఉన్నప్పటికీ అధికార పార్టీకి చెందిన కొందరు నేతలు భూమిని కబ్జాకు పాల్పడి బాధితుడిని బెదిరింపులకు గురి చేశారన్నారు. దీనిపై బాధితుడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే గతంలో పని చేసిన ఎస్‌ఐ ఫిర్యాదు తీసుకోలేదని వాపోయారు. దీంతో డీఎస్పీని సంప్రదించగా, ఆయన బాధితుడిపైనే బెదిరింపులకు పాల్పడి అధికార పార్టీ నేతలకు వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. వెంటనే డీఎస్పీపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు శేఖర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మహా పడిపూజ

చిట్టిఘనాపూర్‌లో శివపార్వతుల కల్యాణం

తాండూరు రూరల్: మండల పరిధిలోని చిట్టిఘనాపూర్‌లో శివనామస్మరణతో మార్మోగింది. సోమవారం శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి జ్యోతిర్లింగ మహాపడి పూజ నిర్వహించారు. గ్రామంలోని హనుమాన్ దేవాలయం నుంచి శివాలయం వరకు 108 కలషలతో ఊరేగించారు. తర్వాత శివపార్వతుల కల్యాణం కనుల పండువగా జరిగింది. కార్యక్రమానికి చుట్టు పక్కల గ్రామాల ప్రజలతో పాటు శివస్వాములు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

శివయోగిస్వామికి పూజలు

కర్ణాటక రాష్ట్రంలోని గుల్బర్గా జిల్లా జావర్గీకి చెందిన శ్రీ శడక్షరి వాసుదేవ శివయోగి స్వామికి గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. చిట్టిఘనాపూర్ గ్రామానికి శివయోగి స్వామి విచ్చేశారు. గ్రామస్తులు ప్రజలు స్వామి ఆశీస్సులు తీసుకున్నారు.



చిట్టిఘనాపూర్‌లో మహాపడి పూజలో పాల్గొన్న గ్రామస్తులు

వాడీవేడిగా మున్సిపల్ సమావేశం

- బడ్జెట్ ఆమోదానికి నేతల మాటల యుద్ధం
- శాంతింపజేసిన ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



సమావేశంలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు: మున్సిపల్ బడ్జెట్ సమావేశం అధికార, ప్రతిపక్ష సభ్యుల వాదనలతో వాడివేడిగా సాగింది. సోమవారం తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ తాటికొండస్వప్నపరిమళ్ అధ్యక్షతన మున్సిపల్ బడ్జెట్ సమావేశం నిర్వహించారు. రూ.65.39 కోట్ల అంచనా వ్యయంతో కౌన్సిల్ సభ్యుల ఎదుట బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి హాజరయ్యారు. సమావేశం ప్రారంభమైన వెంటనే అధికార ప్రతిపక్ష పార్టీలకు చెందిన కౌన్సిలర్‌ల మధ్య వాదోపవాదాలు జరిగాయి. మాటల యుద్ధం తారాస్థాయికి చేరడంతో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి కౌన్సిల్ సభ్యులకు నచ్చజెప్పారు. గొడవలు పడి తాండూరు మున్సిపల్ ప్రగతిని అడ్డుకోవడం సరికదని అన్నారు. మున్సిపల్ పరిధిలో ఉన్న ప్రతి వార్డుకు నిధుల కేటాయింపులో సమాన ప్రతినిధ్యం కల్పించడం జరుగుతోందని ఎమ్మెల్యే అన్నారు. దీంతో కౌన్సిలర్‌లు శాంతించారు. అనంతరం 2024-25 మున్సిపల్ బడ్జెట్ రూ.65.39 కోట్ల నిధులతో కౌన్సిల్ సభ్యులు ఆమోదించారు. మున్సిపల్ పరిధిలోని ప్రతి వార్డుకు రూ.10 లక్షల నిధులతో అభివృద్ధికి నిధులు కేటాయిస్తూ తీర్మానం చేశారు. ఈ నిధులను అభివృద్ధి పనులు చేపట్టేందుకు చైర్‌పర్సన్ ఆదేశాల మేరకు వార్డు కౌన్సిలర్లే పనులు చేసుకొనే అవకాశం ఉందని ఎమ్మెల్యే ప్రకటించారు. అవసరమైన సమయంలో చైర్‌పర్సన్ రూ.50 లక్షల నిధులను వినియోగించేందుకు హక్కులు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ విక్రమ్‌సింహారెడ్డి, వైస్ చైర్‌పర్సన్ పట్లోళ్ల దీపనర్సింహులు, కౌన్సిలర్‌లు ఆసీఫ్, శోభారాణి, సంగీతాఠాకూర్, వరాల శ్రీనివాసరెడ్డి, ప్రభాకర్‌గౌడ్, అంతారం లలిత, రాఘవేందర్ తదితరులున్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి

దోమ: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని కేఎస్ఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు రాజేశ్వరమ్మ అన్నారు. సోమవారం దోమ మండల పరిధిలోని మోత్కుర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు తాగడానికి ఉపయోగపడే నీటి కుళాయిలను ఆమె ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో పేద విద్యార్థులు విద్యను అభ్యసిస్తుంటారని, అలాంటి వారికి ఎంత సాయం చేసిన తక్కువే అన్నారు.

అడవిని పరిశీలించిన అధికారులు



సంగాయపల్లి అడవిలో మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..



పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ కృష్ణ

మంటలను అదుపులోకి తెచ్చిన ఫైర్ సిబ్బంది

ధారూరు: యథేచ్ఛగా అడవి నరికివేత అనే శీర్షికతో సోమవారం 'సాక్షి'లో వచ్చిన కథనానికి ధారూరు ఇన్‌చార్జి ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ కృష్ణ స్పందించారు. రాస్నం ఫారెస్టు సెక్షన్‌లోని సంగయపల్లి బీట్‌లో 4 ఎకరాల్లో నరికివేసిన అటవీ ప్రాంతాన్ని ఆయన సెక్షన్ ఆఫీసర్ మొయినోద్దీన్‌తో కలిసి పరిశీలించారు. చెట్లను నరికివేసి ఆనవాళ్లు లభ్యం కాకుండా దగ్ధం చేసిన తీరును తెలుసుకున్నారు. గిరిజనులు ఆందోళన చేస్తారన్న సమాచారంతో ముందస్తుగా పోలీసుల సహకారం తీసుకున్నారు. 4 ఎకరాలకే పరిమితమైన నరికివేత క్రమేపి విస్తరించినట్లు గుర్తించారు. చెట్లకు రాత్రికి రాత్రే నిప్పంటించడాన్ని తీవ్రంగా ఖండించారు. మండుతున్న అడవిని చూసి వెంటనే ఫైర్ ఇంజన్‌ను రప్పించి మంటలను నియంత్రించారు. సంగయపల్లితండాకు చెందిన ముగ్గురు వ్యక్తులు కలిసి చెట్లను నరికివేసి నిప్పంటించినట్లు అధికారులు గుర్తించినట్లు సమాచారం. అక్రమార్కులు ఆక్రమించిన అడవిలోని విస్తీర్ణం ఎంత అనేది తేల్చేందుకు వెంటనే ఫారెస్టు అధికారులు సర్వే చేయించనున్నట్లు తెలిసింది.

విద్యార్థులకు జిల్లా స్థాయి అవార్డులు



అవార్డులు అందుకుంటున్న విద్యార్థులు

కొడంగల్ రూరల్: శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్ హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన పరీక్షల్లో కొడంగల్ నవీన ఆదర్శ ప్లే హైస్కూల్ విద్యార్థులు జిల్లా స్థాయి అవార్డులు అందుకున్నారు. సోమవారం రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఐఏఎస్ జయప్రకాశ్ నారాయణ చేతుల మీదుగా విద్యార్థులు అవార్డులు అందుకున్నట్లు పాఠశాల ప్రిన్స్‌పాల్ నరేష్‌రాజ్ తెలిపారు. విద్యార్థులు బి.అక్షిత(8వ తరగతి), సాయిశ్రీ(9వ తరగతి), రాజు, అభిషేక్(10వ తరగతి) అవార్డులను అందుకున్నారు. కార్యక్రమంలో శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్ అధ్యక్షుడు అమరేష్, పాఠశాల ఫౌండర్ డి.వెంకటయ్య, వైస్ ప్రిన్స్‌పాల్ సంతోష, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీ లక్ష్మణ్‌ను కలిసిన నరేష్ మహరాజ్



లక్ష్మణ్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న నరేష్ మహరాజ్

తాండూరు: బీజేపీ సీనియర్ రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్‌ను ఆ పార్టీ నాయకుడు నరేష్ మహరాజ్ సోమవారం ఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికలలో చేవెళ్ల సెగ్మెంట్ గెలుపుపై చర్చించారు. ఎన్నికల ప్రచారానికి వికారాబాద్ జిల్లాకు రావాలని కోరారు. అందుకు లక్ష్మణ్ సానుకూలంగా స్పందించారు.